నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, ఆదివారం 17 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

సాగు, ఎరువుల ప్రణాళిక ఇలా..

పంట	సాగు అంచనా (ఎకరాలు)	యూరియా (ఎంటీఎస్)	డీఏపీ (ఎంటీఎస్)	ఎంవోపీ (ఎంటీఎస్)	ఎస్ఎస్పీ (ఎంటీఎస్)	కాంప్లెక్స్ (ఎంటీఎస్)
వరి	2,14,892	19,340	10,744	10,744	21,489	16,116
మక్క	91,227	6,157	4,561	4,561	9,122	11,403
పెసర	8,776	197	219	219	219	219
వేరుశనగ	744	33	37	37	18	18
మినుము	807	18	20	20	20	20
మొత్తం	**3,16,446**	**25,745**	**15,581**	**15,581**	**30,868**	**27,776**

నాగార్జున సాగర్ నీరు విడుదల కాకపోవడం, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడం వంటి కారణాలతో జిల్లావ్యాప్తంగా గత యాసంగిలో లక్ష ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ఇకపోతే వానకాలంలో ఆశించిన మేర సాగునీరు ఉన్నప్పటికీ పంటల పెట్టుబడిని ప్రభుత్వం అందజేయకపోవడం, అతివృష్టి వెంటాడడం వంటి కారణాలతో పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వానకాలం సైతం జిల్లా రైతాంగానికి కలిసిరాలేదు. మొత్తంగా రెండు సీజన్లలో సైతం రైతులు నష్టపోయిన పరిస్థితి నెలకొనడంతో ఈ యాసంగి సీజన్‌లోనైనా ఆ లోటు పూడ్చుకోవాలనే ఆలోచనతో సాగుకు సిద్ధమవుతున్నారు.

- అన్నదాతలకు కలిసిరాని గడిచిన రెండు సీజన్లు
- ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ఆదుకోని ప్రభుత్వం..
- యాసంగైనా సాఫీగా సాగుతుందో లేదోననే భయం
- లోటును పూడ్చుకునేందుకు సమాయత్తమైన కర్షకులు
- ఖమ్మం జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

క్రాప్ హాలీడే కారణంగా నిరుడు యాసంగిలో పాలేరు ఆయకట్టు కింద ఎండిపోయిన వరి (ఫైల్)

యాసంగిపై ఆశలు..

గడిచిన రెండు సీజన్లుగా నష్టపోతున్న రైతన్నలు.. కొండంత ఆశతో ఈ యాసంగికి సిద్ధమవుతున్నారు. అయితే ఇదైనా సాఫీగా సాగుతుందో లేదోననే ఆందోళన వారిని కలవరపెడుతోంది. ప్రకృతి వైపరీత్యాలు ఓవైపు, ప్రభుత్వ పట్టింపులేనితనం మరోవైపు ఉండి వారిని దిగాలు పెట్టిస్తున్నాయి. ఫలితంగా ఖమ్మం జిల్లాలో సాగు కళ తప్పుతున్నది. గడిచిన పదేళ్లలో జిల్లాలో వానకాలం, యాసంగి సీజన్‌లో సైతం ప్రకృతి సహకరించడం, ప్రభుత్వం కూడా రైతులకు కొండంత అండగా నిలవడం, అన్నింటా భరోసా కల్పించడం వంటి కారణాలతో ఎవుసం 'మూడు పువ్వులు - ఆరు కాయలు' అన్నట్లు సాగింది. దీంతో తెలంగాణకే ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నపూర్ణగా మారింది. అయితే గత యాసంగి నుంచి జిల్లా వ్యవసాయ రంగంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి.

–ఖమ్మం, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఇప్పటికే ఆయా మండలాల్లో రైతులు యాసంగి సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వానకాలం సాగు చేసిన వరి పొలాలు కోత దశలో ఉన్నప్పటికీ పత్తి పంటను తొలగించి ఆ స్థానంలో రైతులు మక్క సాగు చేపడుతున్నారు. అందుకు అనుగుణంగానే తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ సొసైటీలకు విత్తనాల పంపిణీని ప్రారంభించింది. ఈ యాసంగి సీజన్‌లో వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం పెసర (ఎంజీజీ-295) 34 క్వింటాళ్లు, ఎంజీజీ-385 23 క్వింటాళ్లు, మినుములు రెండు రకాలు కలిపి 33 క్వింటాళ్లు, శనగ రెండు రకాలు కలిపి 50 కేజీలు, వేరుశనగ 79 క్వింటాళ్లు, వరికి సంబంధించి సన్నాలు, దొడ్డు రకాలు కలిపి 166 క్వింటాళ్లు అవసరం కావచ్చని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుందనే ఆశతో ఈ యాసంగిలో రైతులు భారీగా సన్నరకం సాగు చేసే యోచనలో ఉన్నారు. పత్తి పంటలో పూర్తిగా దిగుబడులు తగ్గడంతో ఒకసారి పంట తీతతోనే అనేక మండలాల్లో రైతులు పంటను తొలగించి మక్క సాగుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు.

రికార్డు స్థాయిలో సాగుకు అవకాశం

జిల్లాలో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో యాసంగిలో రైతులు సాగు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం భూగర్భ జలాలతోపాటు చెరువులు, కుంటల్లో సైతం సాగునీరు పుష్కలంగా ఉంది. దీనికి తోడు సాగర్ ఎడమ కాలువ నుంచి సైతం పుష్కలంగా నీరు లభించే అవకాశం ఉంది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం వివిధ రకాల పంటలు కలిపి జిల్లావ్యాప్తంగా 3.16 లక్షల ఎకరాలు సాగు జరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితి పరిశీలిస్తే.. దాదాపు 4 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా వరి, మక్క పంటలు భారీగా సాగయ్యే అవకాశముంది. వాటి తర్వాత పెసర, మినుము, మిర్చి తోటల సాగు సైతం జరగనుంది. దీంతో ఎరువులు, డీఏపీ అవసరం చాలా ఉంటుంది. ప్రస్తుతం వానకాలం పంటల కోతలు జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో వరి నారుమడులు సైతం పోసుకుంటున్నారు. వచ్చే నెలలో వరి నాట్లు జోరుగా సాగే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం జిల్లాలో ఇతర ఎరువులు నెలకు సరిపడా ఉన్నప్పటికీ డీఏపీ చాలా కొరత ఉందనే వార్తలు వినపడుతున్నాయి. అనేకమంది సొసైటీ బాధ్యులు తమకు డీఏపీ కావాలని కోరుతున్నా ప్రస్తుతం స్టాక్ లేదని సంబంధిత అధికారులు వారికి బదులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రోడ్డు మార్గాన్నైనా డీఏపీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తేనే రైతులకు అందించే అవకాశం ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, చిత్రంలో మెచ్చా

కాంగ్రెస్ నుంచి.. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

- పదకొండు నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు..
- ఎక్కడ ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే డబ్బుల మూటలు
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

దమ్మపేట, నవంబర్ 16: ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. 420 హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని వదలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్థానిక పార్కలగండిలోని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కొబ్బరి తోటలో ఆయనతో కలిసి శనివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో రేగా మాట్లాడారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే డబ్బుల మూటలు వెళ్తున్నాయని ఆరోపించారు. ఓ మంత్రి బాంబులు పేలుతాయని పదే పదే చెబుతున్నా.. అవన్నీ తుస్సుమంటున్నాయని ఎద్దేవా చేశారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక జరిగితే.. అక్కడ బీఆర్ఎస్‌దే విజయమని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి మాత్రం సున్నా అన్నారు. రాబోయే కాలంలో మళ్లీ కాబోయే ముఖ్యమంత్రి కేసీఆరే అని రేగా స్పష్టం చేశారు.

హామీల అమలు ఘనత కేసీఆర్‌దే: మెచ్చా

ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వాటిని కూడా నెరవేర్చిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్‌లోని కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను బెదిరిస్తున్నారని, వారు పద్ధతి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలంటే ప్రభుత్వానికి భయమేస్తున్నదని, అందుకే వాయిదాలు వేస్తున్నదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దొడ్డా రమేశ్, తూతా నాగమణి, దారా మల్లికార్జునరావు, రావు జోగేశ్వరరావు, గాజుబోయిన ఏసుబాబు, దారా యుగంధర్, తెలంగాణ శ్రీను, పాకనాటి శ్రీను, దేవులపల్లి పెద్ద బుజ్జయ్య, తాటి పోతు రాజు, రావుల శ్రీనివాసరావు, జలగం వాసు, రెడ్డిమళ్ల నాగయ్య, ఎస్‌కె బుడే, ఉయ్యాల చిన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులది ధర్మబద్ధ పోరాటం

- అందుకే వారి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాం
- కర్షకుల భూములను బలవంతంగా లాక్కుంటే ఉద్యమిస్తాం
- ఫార్మా కంపెనీలకు ఏజెంట్లలా వ్యవహరిస్తున్న మోదీ, రేవంత్
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, చిత్రంలో గుమ్మడి

ఖమ్మం, నవంబర్ 16: వికారాబాద్ జిల్లా లగచర్ల రైతుల ధర్మబద్ధ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఫార్మా కంపెనీల కోసం రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కోవడం అన్యాయమని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. మూడు రోజులుగా ఖమ్మంలో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, చిన్న, సన్నకారు రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కోవడం, అక్రమ కేసులతో వారిని జైళ్లకు పంపడం అన్యాయమని అన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ, రాష్ట్రంలో ఉన్న రేవంత్‌రెడ్డిలు.. ఫార్మా కంపెనీలకు ఏజెంట్లలా పనిచేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు మల్లన్నసాగర్ విషయంలో ఏమి మాట్లాడారో సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం సరైంది కాదని హితవుచెప్పారు. ఇటీవలి ఆందోళన సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం ఈ నెల 19న లగచర్ల ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని తెలిపారు.

హైడ్రా పేరుతో పక్కదోవ..

కాంగ్రెస్ ప్రభుత్వం.. హైడ్రా పేరుతో ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని రంగారావు విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టాలని చూస్తున్న రేవంత్ సర్కారు.. ఎన్నికల హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసలు అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తేమతో సంబంధం లేకుండా సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని, అన్ని రకాల ధాన్యానికీ బోనస్ ఇవ్వాలని, ఆయా ధాన్యాలను ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేలు కేజీ రామచందర్, కే రమ, కెచ్చెల రంగయ్య, గోకినపల్లి వెంకటేశ్వరరావు, చిన్న చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, కృష్ణ, ప్రభాకర్, సదానందం, సూర్యం, ఎం.కృష్ణ, అరుణ, కృష్ణారెడ్డి, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ గేటుకు తాళం వేసి ఆందోళన

- కాంటాల్లో మోసం చేస్తున్నారని ఏన్కూరులో అన్నదాతల ఆరోపణ
- మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

వైరా టౌన్, నవంబర్ 16: కాంటాల్లో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ పలువురు రైతులు శనివారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ గేటుకు తాళం వేసి ఆందోళన చేపట్టారు. మార్కెట్‌లో వేబ్రిడ్జి ఉన్నప్పటికీ ప్రైవేటు వేబ్రిడ్జి వద్దకు పంపించి వ్యాపారులు మోసాలకు పాల్పడుతుండడాన్ని గ్రహించిన రైతులు తమకు న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. మార్కెట్‌లో ఉన్న కాంటాను వాడకుండా బయట వేబ్రిడ్జికు పంపడం ఏమిటని అక్కడే ఉన్న మార్కెట్ కార్యదర్శిని రైతులు ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక మిన్నకుండిపోయారు. తమను ఇంతగా మోసం చేస్తున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం, న్యాయం చేయాలని కోరుతూ రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కాంటాల్లో మోసాలను నివారించి.. వ్యాపారుల దగా నుంచి రక్షించాలని అధికారులను వేడుకున్నారు. రైతుల ఆందోళన వద్దకు చేరుకున్న పోలీసులు వారిని సముదాయించి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఇళ్ల స్థలాల కోసం రాస్తారోకో

గిరిజనులు వేసిన గుడిసెలు తొలగించిన అటవీ శాఖ అధికారులు

వినాయకపురం-మామిళ్లవారిగూడెం రహదారిపై బైఠాయింపు

రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేట, నవంబర్ 16: అశ్వారావుపేట మండలం వినాయకపురం సమీపంలో వేసుకున్న గుడిసెలను శనివారం అటవీ శాఖ అధికారులు తొలగించడంతో ఆగ్రహించిన గిరిజనులు వినాయకపురం-మామిళ్లవారిగూడెం రహదారిపై బైఠాయించారు. వినాయకపురానికి చెందిన పలువురు గిరిజనులు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న దమ్మపేట, అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజర్లు కరుణాకరాచారి, మురళి తమ సిబ్బందితో శనివారం ఘటనా స్థలానికి చేరుకుని గుడిసెలను తొలగించారు. ఈ క్రమంలో అటవీ అధికారులతో గిరిజనులు వాగ్వాదానికి దిగడంతో ఐదుగురిని అదుపులోకి తీసుకొని దమ్మపేట అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. దీంతో ఆగ్రహించిన గిరిజనులు వినాయకపురం-మామిళ్లవారిగూడెం రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై యయాతి రాజు అక్కడకు చేరుకుని గిరిజనులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న గిరిజనులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్కడి నుంచి దమ్మపేట రేంజ్ కార్యాలయానికి చేరుకున్న గిరిజనులు అటవీ అధికారులతో చర్చలు జరిపారు. తాము ఆక్రమించిన భూమి రెవెన్యూ శాఖకు చెందిందని గిరిజనులు చెబుతుండగా.. అటవీ శాఖ అధికారులు మాత్రం తమ శాఖకు చెందిన భూమి అని పేర్కొంటున్నారు.

'గ్రూప్-3' కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆది, సోమవారం జరగనున్న గ్రూప్-3 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 13,478 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా.. 39 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద సుమారు 350 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు, 18వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలని, మధ్యాహ్నం 2:30 గంటలలోపు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి తీసుకెళ్లకూడదని తెలిపారు. అలాగే బందోబస్తు విధులకు హాజరుకాబోయే పోలీస్ అధికారులు, సిబ్బందితో కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణలు సమావేశమై వారికి పలు సూచనలు చేశారు.

భద్రాద్రి జిల్లా ఎస్పీ బీ రోహిత్ రాజు

'స్థానికం'లో బీసీలకు రిజర్వేషన్ల అమలుపై కలెక్టరేట్‌లో నేడు బహిరంగ విచారణ

మామిళ్లగూడెం, నవంబర్ 16: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలుపై బీసీ కమిషన్ డెడికేషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి సైదులు ఆధ్వర్యంలో ఆదివారం బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి శనివారం తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగే విచారణకు ఆసక్తి గల బీసీ సంఘాలు, ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజలు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని పేర్కొన్నారు. విచారణ ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన వారు పాల్గొనాలని తెలిపారు.